# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# కాంగ్రెస్‌కు ఓటేస్తే ఎవుసం ఆగమే

మళ్లీ పాత రోజులే వస్తయ్ • ఉచిత కరెంట్ ఖతమైతది

కాళేశ్వర జలాలు రాకుండా పోతయ్

ఎన్కటి లెక్కనే భూములు బీళ్లయితయ్

ధరణి పోయి పాత వ్యవస్థ వస్తది • భూములకు భద్రత కరువైతది

కౌలుదారు కాలంతో భూమి దొరుకుడు కష్టమైతది

ధరలు పడిపోతయ్ • రైతు కుటుంబాలు ఆగమైతయ్

• ఆందోళనలో కర్షకలోకం • రైతులను ఆగం చేయద్దని హెచ్చరిక • హస్తం పార్టీ తీరుపై ఆగ్రహం



## రైతులను మళ్లీ కష్టాల్లోకి నెట్టుతరా?

నాడు కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతలతో ఎన్నో అవస్థలు పడ్డాం. ఎకరం రెండెకరాలు పారుడే కష్టమయ్యేది. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంకనే రైతుల జీవితాలు బాగుపడ్డయ్. 24 గంటల ఉచిత కరెంట్‌తో మంచిగా వ్యవసాయం చేసుకుంటున్నం. కాంగ్రెస్ నాయకులు మళ్లీ మూడు గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్లంటూ రైతులను ఆగం చేస్తున్నరు. మూడు గంటల కరెంట్‌తో పంటలెట్ల పండిస్తం. 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలంటే అందరికీ సాధ్యమైతదా. పెట్టుకున్నా నీళ్లు సరిపోక బోర్లు ఎండిపోయే పరిస్థితి వస్తది. ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పడి కాలిపోవా?. కాంగ్రెస్ నాయకుల మాటలు సరైనవి కావు. మూడు గంటల కరెంట్‌తో రైతులను మళ్లీ కష్టాల్లోకి నెట్టుతరా?. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే ఆగమయ్యే ప్రమాదం ఉంది. అన్ని విధాలా అండగా నిలుస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ వస్తేనే వ్యవసాయం సాగుతది.

**-వెన్నం శేఖర్ రెడ్డి, రైతు, గొల్లపల్లి, (తిమ్మాపూర్ రూరల్)**



## కాంగ్రెసోళ్లవి మూర్ఖత్వపు మాటలు

వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటర్లను వినియోగించడం తెలివి తక్కువతనమే. ఎందుకంటే అవి కాల్వలు ఉన్న ప్రాంతంలో మాత్రమే అవసరమవుతయ్. ఆ మోటర్లు వాడాలంటే నీళ్లు చాలా ఎక్కువ ఉండాలి. తెలంగాణలోని ఏ జిల్లాలో కూడా అలాంటి మోటర్ల వినియోగం అవసరమే ఉండదు. 10 హెచ్‌పీ మోటర్ ఒక్కసారి నడిస్తే బావిలోని నీళ్లను మొత్తం గుంజేస్తది. దీంతో నీళ్లు ఆఖరి తడికి నీళ్లందయ్. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మా రైతుల మధ్య మాకే చిచ్చు పెట్టేందుకే ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలని చెప్తండు. ఉదాహరణకు..10 హెచ్‌పీ మోటర్ పక్కనే 5 హెచ్‌పీ ఉంటే.. కరెంటు సాలక 5 హెచ్‌పీ మోటర్ ఆగిపోతది. పనిచేయదు. నీళ్లు రావు. దీంతో చాలా గొడవలు జరుగుతాయి. ఇదంతా రేవంత్‌రెడ్డికి అవగాహన లేదనుకుంట.. తెలంగాణలో ఈ విధానం కరెక్ట్ కాదు. నాకు ఉన్నది ఎకరం భూమి. దానికి ఏ మోటర్ పెట్టిన నీళ్లు సరిపోతయి. 10 హెచ్‌పీ మోటర్ రైతులందరూ వాడాలని చెప్పడం కాంగ్రెస్ నాయకులు మూర్ఖత్వమే.

**- ఎడ్ల కనకయ్య, సిర్సపల్లి (హుజూరాబాద్‌టౌన్)**

కరీంనగర్, నవంబర్ 28 (నమస్తేతెలంగాణప్రతినిధి) : నిజానికి యాభై ఎనిమిదేండ్ల సమైక్య రాష్ట్రంలో తెలంగాణ దగా పడ్డది. అందులోనూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వ్యవసాయ రంగం పూర్తిగా ఆగమైంది. పూడికతో నిండిన చెరువులు, కుంటలు, నెర్రెలు బారిన నేలలు, సముద్రంపాలైన గోదావరి జలాలు.. సాగునీటి వసతి లేక బీడుగా భూములు.. నీళ్లు, కరెంట్ లేక కండ్ల ముందే ఎండిన పంటలు.. చివరకు అప్పులు, ఆత్మహత్యలు, వలసలు.. అయినా పట్టని ప్రభుత్వాలు.. ఇలా కండ్లముందే కదలాడుతున్న నాటి రోజులను మరిచిపోలేకపోతున్నది. ఉద్యమ సమయంలో ఈ పరిస్థితులను కండ్లారా చూసిన కేసీఆర్, పదేళ్ల కాలంలోనే రైతులను గట్టెక్కించారు. అన్ని విధాలా అండగా నిలిచి సాగును పండుగలా చేశారు. ప్రాజెక్టులు నిర్మించి ప్రతి ఎకరాకూ గోదావరి జలాలను తెచ్చారు. మిషన్ కాకతీయ కింద చెరువులు పునరుద్ధించారు. రైతుబంధు ఇచ్చి పెట్టుబడికి సహాయంగా నిలిచారు. ఇప్పటి వరకు పదకొండు విడుతలుగా 9.25,343 మంది రైతులకు ₹7,750.68 కోట్లను జమ చేశారు. అలాగే, వ్యవసాయ విస్తరణ అధికారుల సేవలను మరింత అందుబాటులోకి తెచ్చారు. 2014లో 69 మంది ఉంటే.. తర్వాత కొత్తగా 189 నియమించారు. ప్రస్తుతం 258 పని చేస్తున్నారు. ఇంకా పంట రుణాలు మాఫీ చేయించి అప్పుల భారం లేకుండా చేశారు. రైతు బీమాతో కుటుంబాలకు భరోసానిచ్చారు. ప్రధానంగా సాగునీరు, 24 గంటల కరెంట్ ఇచ్చి దశాబ్దాల గోసను తీర్చారు.

### పది లక్షల ఎకరాల్లో సాగు

రైతుబిడ్డ కేసీఆర్ కృషితో ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ రంగం బలోపేతమైంది. 2014కు ఇప్పటికి తేడా చూస్తే.. ఆనాడు ఉమ్మడి జిల్లాలో సాగు చేసిన రైతుల సంఖ్య 3,57,725 మంది ఉంటే.. ప్రస్తుతం 9,25,343కు చేరింది. ఈ పదేళ్లలో కొత్తగా 5,67,618 మంది సాగుబాట పట్టడం కనిపించింది. అలాగే, అప్పుడు అన్ని పంటల సాగు విస్తీర్ణం 11,79,013 ఎకరాలు ఉంటే, ప్రస్తుతం 22,41,066 ఎకరాలకు చేరింది. అంటే 10,62,053 ఎకరాల్లో సాగు పెరిగింది. వరి సాగు 3,63,776 ఎకరాల్లో మాత్రమే ఉంటే.. ప్రస్తుతం 12,35,223 ఎకరాలకు చేరింది. అంటే 8,71,447 ఎకరాల్లో వరి విస్తీర్ణం పెరిగింది. దిగుబడి కూడా 13,97,118 మెట్రిక్ టన్నులు ఉంటే.. ప్రస్తుతం 28,60,702 మెట్రిక్ టన్నులకు పెరిగింది. అంటే 14,63,584 మెట్రిక్ టన్నుల దిగుబడి పెరిగింది. ఇదంతా కాళేశ్వరం జలాలు రావడం, 24 గంటల ఇవ్వడంతోనే ఇది సాధ్యమైంది. 2018కి ముందు అంటే.. రైతుబంధుకు ముందు 14,29,562 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంటే.. రైతుబంధు అమలు తర్వాత 22,41,066కు పెరిగింది. అంటే ఈ ఐదేళ్లలోనే 8,11,504 ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగింది.

### విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు

స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్.. విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. రైతులకు నాణ్యమైన 24 గంటల కరెంటు ఇవ్వాలన్న సంకల్పంతో ముందుకు సాగారు. అందుకు అనుగుణంగా సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేయడంతోపాటు ఇతర సదుపాయాలు కల్పించారు. దీంతో వ్యవసాయరంగంలో వినియోగం భారీగా పెరిగింది. 2014లో ఉమ్మడి జిల్లాలో 1,120.36 మెగావాట్ల వినియోగం ఉంటే.. ప్రస్తుతం ఆ డిమాండ్ 3,328.85 మెగావాట్లకు చేరింది. అంటే గడిచిన తొమ్మిదేళ్లలో 2,234.83 మెగావాట్ల వినియోగం పెరిగింది. 2014లో ఉమ్మడి జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్య 53,247 ఉంటే.. ప్రస్తుతం 78.958కు చేరింది. అంటే ప్రభుత్వం 25,711 ట్రాన్స్‌ఫార్మర్లు పెంచింది. 2014లో 3,39,298 కనెక్షన్లు ఉంటే.. అవి ప్రస్తుతం 4,18,505కు చేరాయి. గడిచిన తొమ్మిదేళ్లో 79,128 కనెక్షన్లు పెరిగాయి. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో సాగుకు దేశంలో ఎక్కడాలేని విధంగా 24 గంటల నాణ్యమైన కరెంటును ప్రభుత్వం అందిస్తున్నది.

### ఎవుసం మళ్లీ మొదటికి..?

ఒకవైపు సాగునీరు.. మరోవైపు 24 గంటల కరెంటు, రైతుబంధు వంటివి ఇచ్చి ఉత్పత్తులను అనూహ్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పెంచారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. పదేళ్ల క్రితం లక్ష రూపాయలకు దొరికిన ఎకరం భూమి.. ఈ రోజు రూ.25 లక్షలకు తక్కువగా దొరకడం లేదు. దీంతో భూవివాదాలు పెరిగి భూములకు భద్రత లేకుండా పోతుందని భావించిన ముఖ్యమంత్రి.. రైతుల భూములకు సంపూర్ణ హక్కుతోపాటు రక్షణ కల్పించేందుకు ధరణి పోర్టల్‌ను అమల్లోకి తెచ్చారు. దీంతో రైతులు నిశ్చింతంగా ఉన్నారు. భూముల లావాదేవీలు కూడా పెరిగి, ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ భూములు కొంటున్నారు. అయితే, ఇప్పుడు తాము అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామని కాంగ్రెస్ చెబుతున్నది. నిజంగా ధరణి అనేది పక్కన పెడితే.. ముందుగా భూములకు రక్షణ లేకుండా పోతుంది. భూ వివాదాలు పెరుగుతాయి. ఫలితంగా ధరలు పడిపోయే ప్రమాదముంటుంది. పటేల్ పట్వారీ వ్యవస్థ తిరిగి వచ్చే ప్రమాదముంటుంది. అలాగే.. కాంగ్రెస్ నేతలు చెప్పినట్టు కౌలుదారు కాలం పెడితే భూ యజమానికి, కౌలుదారులకు మధ్య వివాదాలు తలెత్తడమే కాదు, భూ యజమానులు కౌలుకు ఇవ్వకుండా నిలిపివేసే ప్రమాదముంటుంది. క్రమంగా సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే ముప్పు ఉంటుంది. అలాగే, కరెంటుపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక్కొక్కరు ఒక్కో రకంగా మాట్లాడుతున్నరు. స్వయంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 24 గంటల కరెంటు రైతులకు అవసరం లేదని మూడు గంటలు ఇస్తే సరిపోతుందని ఇప్పటికే స్పష్టం చేశారు. ఇదే జరిగితే.. రైతులు మళ్లీ చాలీచాలని పాత కష్టాలే కొనితెచ్చుకున్నట్లు అవుతుంది. ఇంకా ఆ పార్టీ నాయకులు రైతుబంధు దుబారా అంటున్నారు. ఇప్పుడు ఏకంగా పెట్టుబడి సాయం పడకుండా చేశారు. ఒకవేళ వాళ్లకు ఓటేస్తే.. రైతు బంధును మొత్తానికే లేకుండా చేసే ప్రమాదమున్నది. ఇలా.. ఏ కోణంలో చూసినా రైతును జీవన్మరణ సమస్య నుంచి బయట పడేసిన 24 గంటల కరెంటు, ధరణి వంటి విషయంలో ఏమాత్రం పొరపాట్లు జరిగినా.. మళ్లీ ఎవుసం మొదటికే రావడంతోపాటు గ్రామీణ వ్యవస్థ అతలాకుతలమయ్యే ప్రమాదమున్నది. తద్వారా తాము ఆర్థికంగా దెబ్బతింటామన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతున్నది.

**పదకొండు విడుతల్లో ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల వారీగా వచ్చిన రైతు బంధు లబ్ధిదారులు, రైతుల ఖాతాల్లో జమైన డబ్బుల వివరాలు**

| నియోజకవర్గం | లబ్ధిపొందుతున్న రైతుల సంఖ్య | 11విడుతల్లో వచ్చిన రైతు బంధు మొత్తం |
|---|---|---|
| చొప్పదండి | 85,859 | 719.61 కోట్లు |
| హుజూరాబాద్ | 73,667 | 584.41 కోట్లు |
| కరీంనగర్ | 21,634 | 138.34 కోట్లు |
| మానకొండూరు | 92,419 | 820.05 కోట్లు |
| జగిత్యాల | 58,069 | 442.74 కోట్లు |
| ధర్మపురి | 1,00,696 | 752.48 కోట్లు |
| కోరుట్ల | 58,959 | 521.79 కోట్లు |
| మంథని | 86,050 | 754.71 కోట్లు |
| పెద్దపల్లి | 90,743 | 731.74 కోట్లు |
| రామగుండం | 15,463 | 112.23 కోట్లు |
| సిరిసిల్ల | 67,516 | 562.64 కోట్లు |
| వేములవాడ | 74,587 | 695.00 కోట్లు |
| హుస్నాబాద్ | 99,681 | 914.94 కోట్లు |
| మొత్తం | 9.25,343 | 7,750.68 |

## భూములకు గీ ధరలేడుంటయి..



ఒకప్పుడు ఏ ఊళ్లెకు పోయినా నీళ్లు సక్కగ ఉండకపోయేది. భూములు బీడువారి ఉండేటిది. కనీ, సీఎం కేసీఆర్ పగ్గాలు వట్టినంక ఏ మూలకో ఉన్న నీళ్లను మన ఊళ్లల్లకు తింపిండు. ఇప్పుడు భూములకు ఊర్లల్ల మస్తు రేట్లున్నయ్. ఏ మూలకు పోయినా మా కాడ రూ.కోటికి ఎకరం దొరుకుతలేదు. ఒకప్పుడు రూ.మూడు, నాలుగు లక్షలుండే. ఊళ్లల్ల పెరుగుతన్న సౌలతులు, నీళ్లు, పంటలతోని ఈ ఐదారేండ్లల్ల మస్తు రేట్లు పెరిగినయ్. మాకు గుడ ధైర్నంగ ఉన్నది. గిప్పుడు కేసీఆర్ సార్‌ను కాదని ఎవలకు పడ్తే ఆళ్లకు ఓట్లేత్తే గీ రేట్లుండయ్. గీ నీళ్లుండయ్. రేట్లన్నీ తక్కువైతయ్. మన భూములకు విలువనే ఉండది. గిప్పుడున్న రూ.కోట్ల ధరలేడుంటయ్.? గింత అభివృద్ధి అయితదని, ధరలు పెరుగుతయని కలల గుడ ఊహించలేదు.

**- కాలువ నర్సయ్య, రైతు, నుస్తులాపూర్(తిమ్మాపూర్)**

## గీ నీళ్లుండయ్.. ధరలుండయ్



తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధితోనే మన భూములకు మంచి డిమాండ్ వచ్చింది. రేట్లు పెరిగినయ్. ఒకప్పుడు మా ఊళ్లె భూమిని ఎవలు పట్టించుకోకపోవు. గిప్పుడు భూమి దొరుకుతదా? అని వారానికి ఒగలు ఫోన్ చేస్తరు. బీడు పడిన భూములకు నీళ్లిచ్చి రేట్లకు అమాంతం రెక్కలచ్చి ఎగిరినట్టే చేసిండు సీఎం సార్. మన భూములకు రేట్లెందుకు పెరిగినయో అందరూ ఆలోచించాలే. ఇప్పుడున్న ప్రభుత్వాన్ని మల్ల అధికారంలకు తెత్తెనే గిప్పుడున్న రేట్లు, అభివృద్ధి ఇట్లనే ఉంటది. అట్ల కాదని కాంగ్రెస్‌కు ఓట్లేత్తే గీ ధరలుండయ్, నీళ్లుండయ్. భూములతోని రియలెస్టేట్ చేసి ఎంతోమంది బతుకుతన్రు. ఇసోంటి సౌలత్ వేరే ప్రభుత్వం అత్తె ఉండది.

**-వంతడుపుల సంపత్, మొగిలిపాలెం (తిమ్మాపూర్)**

## రైతులు బాగుపడుడు కాంగ్రెస్‌కు ఇష్టం లేదు



బీఆర్ఎస్ వచ్చినంకనే రైతుల బతుకులు బాగుపడ్డయి. ఇది కాంగెసోళ్లకు ఇష్టం లేనట్టుంది. అందుకే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నరు. మూడు గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్లు అంటూ రైతులను ఆగంజేస్తన్రు. వాళ్లకు అసలు ఎవుసం గురించి సక్కగ తెలుసా?. రైతులు 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లు మాత్రమే వాడుతరు. అసలు 10 హెచ్‌పీ మోటర్ పెడితే లోడ్ పడి ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటయా? బోర్లు, బావుల్ల నీళ్లు సాలుతయా? వేసిన పంటలు చేతికస్తయా? కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే రైతులకు కష్టాలు తప్పవు. అంతే కాదు, గీళ్లు కనీ వస్తే రైతులంతా ఆగమైతరు.. కరెంటు ఉండదు.. నీళ్లు రావు.. ఇవి రెండూ లేకపోతే పంటలు పండవు.. భూముల ధరలు పడిపోతయ్.. రైతులకు పని లేక కూలీలై వలసలు పోతరు.

**-నూకల పరశురాములు, రైతు, మైలారం (గన్నేరువరం)**